మహనీయుల త్యాగ ఫలితమే ప్రత్యేక తెలంగాణ


బాగ్‌అంబర్‌పేటలో మాజీ ఎంపీ వీహెచ్



సోనియాగాంధీ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఉషా శ్రీకాంత్‌గౌడ్


అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ నేతలు


కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్


బర్కత్‌పుర బీజేపీ నగర కార్యాలయం వద్ద డాక్టర్ కె.లక్ష్మణ్

కాచిగూడ: ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పదో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ఎంతో మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాజీ మంత్రి మర్రి శశీధర్‌రెడ్డి, డాక్టర్ ఎన్.గౌతంరావు, శ్యామ్‌సుందర్‌గౌడ్, కన్నె ఉమారమేష్‌యాదవ్, శ్యామ్‌రాజ్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, వినోద్‌యాదవ్, నందకిషోర్‌యాదవ్, కన్నె రమేష్‌యాదవ్, కేశబోయిన శ్రీధర్, వనం రమేష్, పూస రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడ ఐపీఎంలో...

నారాయణగూడలోని టీఎన్జీవోస్ ఐపీఎం కార్యాలయంలో జాతీయ జెండాను టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణగౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. టీఎన్జీవోస్ ఐపీఎం అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రదీప్, భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలో జాతీయ జెండాను సీనియర్ కాంగ్రెస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు ఎగురవేశారు.


లింగంపల్లి చౌరస్తాలో జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు.


నారాయణగూడలో టీఎన్జీవోస్ ఐపీఎం బ్రాంచ్ కార్యాలయంలో..


కాచిగూడలో కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్


కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ..


నగర కేంద్ర గ్రంథాలయంలో..


గాంధీనగర్ అరుంధతినగర్‌లో..

యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి

కాచిగూడ: యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసి ధార్మిక భావాలను పెంపొందించుకోవాలని ప్రముఖ సామాజికవేత్త లయన్ ఆకుల రవీందర్ రావు అన్నారు. బాల భారతి శిక్షణ సమితి అధ్యక్షుడు కుంట రామకృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు నెలరోజుల పాటు వేదిక్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు, యోగా, మెడిటేషన్, ప్రాణాయామ, సనాతనధర్మం తదితర అంశాల్లో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆదివారం ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన వేదిక్ క్యాంపు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ధార్మిక భావనలు పెంపొందించేందుకు బాల భారతి శిక్షణ సమితి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యువత పాశ్చాత్య పోకడలకు బానిసలు కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు చిన్నతనం నుంచే అలవాటు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. దైవచింతన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. భగవద్గీత టీచర్ రేఖ, యోగా టీచర్ ప్రభావతి, నిర్వాహకులు వీరేష్‌గౌడ్, మధు, రామమూర్తి, భార్గవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆకుల రవీందర్‌రావు

కమనీయం..శ్రీనివాస కల్యాణం

కాచిగూడ: సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విష్వక్సేన, కుబేర, ధన్వంతరి, సహిత లక్ష్మీ నారసింహ సుదర్శన హోమాన్ని జరిపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పల్లా కృష్ణ మోహన్ గుప్త, ప్రధానకార్యదర్శి గోలి రమేష్, కోశాధికారి పసుపునూరి వినోద్ కుమార్ పాల్గొన్నారు.


శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న దంపతులు

సామాజిక తెలంగాణ సాధనకు మరో ఉద్యమం

కాచిగూడ: సామాజిక తెలంగాణ సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో మరో ఉద్యమం చేపట్టనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. అయితే ప్రత్యేక రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, సబ్బండ వర్గాలకు న్యాయం జరగడం లేదన్నారు. సబ్బండ వర్గాల పోరాటం, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కష్టనష్టాలకు ఓర్చుకుని పోరాటంలో ముందుండి ఉద్యమాన్ని నడిపించారని, సాధించుకున్న తెలంగాణలో మాత్రం బీసీలకు జనాభా ప్రాతిపదికన వాటా దక్కడం లేదన్నారు. అగ్రవర్ణాల చేతిలో తెలంగాణ బందీగా మారిందని, బీసీల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. సామాజిక తెలంగాణతోనే అందరికీ సమ న్యాయం జరుగుతుందన్నారు. అందుకు ప్రత్యేక వేదిక ద్వారా ఉద్యమించనున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న గుజ్జ సత్యం

ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరుల పాత్ర కీలకం


కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న జైసింహ తదితరులు

చిక్కడపల్లి: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల పాత్ర కీలకమని బీఆర్ఎస్ యువజన విభాగం నేత ముఠా జైసింహ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి అశోక్‌నగర్ క్రాస్ రోడ్డులోని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల వెలిగించి అమరులకు నివాళులర్పించారు. త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. 1200మంది బలిదానాలతో దిగివచ్చిన అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఇచ్చిందన్నారు. అమరుల ఆశయసాధనకు బీఆర్ఎస్ నిరంతరం శ్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదారపు రాకేష్‌కుమార్, నేతలు బోసం ఉర్మిళ, శ్రీకాంత్, టి.సంజీవ్‌కుమార్, ఎయిర్‌టెల్ రాజు, పున్నా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) శివరాంపల్లి - బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ కోసం కత్తితో దాడి

వెంగళరావునగర్: ఫోన్ కోసం ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం జాషువకుమార్ నలందా కళాశాలలో పని చేస్తున్నాడు. ఆదివారం అతను కాలేజీ ఎదుట కూర్చుని ఉండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి తన ఫోన్ కావాలని అడిగి తీసుకున్నారు. ఫోన్‌తో పారిపోతుండగా వారిని పట్టుకునేందుకు యత్నించిన జాషు వాపై కత్తితో దాడి చేశారు. దీనిని గుర్తించిన హాస్టల్ విద్యార్థులు నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్‌లో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ప్రీతి అనే యువతి సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ వెంగళరావునగర్‌కాలనీలో ఉంటోంది. గత నెల 31న రాత్రి గదినుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె సోదరుడు పృథ్వీరాజ్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

వెంగళరావునగర్: రాంగ్‌రూట్ వచ్చిన బైక్ మరో వాహనాన్ని ఢీ కొట్టడంతో ఓ మహిళకు స్వల్ప గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అమీర్‌పేట ఆర్‌బీఆర్ క్వార్టర్స్‌లో ఉంటున్న పి.జయలక్ష్మి ఈనెల 1 బైక్‌పై యూసుఫ్‌గూడ వెళుతుండగా రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన మరో బైక్ ఆమె వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు

వెంగళరావునగర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరాలని యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వరమ్మ అన్నారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం యూసుఫ్‌గూడకు చెందిన ధర్మారావు నగదు బహుమతులు అందించజేశారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు తబిత జాసన్, నర్సింహా, మహ్మద్ అలీ, శ్రీనివాసన్, ప్రభాకర్, శాంతి, ముంతాజ్, స్కూల్ టాపర్స్ కళ్యాణి, గాయత్రి, తనూజ, రవికుమార్, శివానీ, శిరి, సాదియాబేగం, ఇమాంబీలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక వేడుకలు



విద్యార్థుల నృత్యాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యా సంస్థల కార్యదర్శి గడ్డం వినోద్‌కుమార్ జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆకాంక్షించిన ప్రయోజనాలు నెరవేరాలన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అందరు తమ వంతుగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషితోనే తెలంగాణ ఏర్పాటు

ముషీరాబాద్: కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ కల సాకారమైందని బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షులు అజయ్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలితంగా అవిర్భావించిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు సదా, సంతోష్, డివిజన్ ఉపాధ్యక్షులు బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న శ్రీనివాస్‌రావు

తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం


తెలంగాణ ఉద్యమకారులను సత్కరిస్తున్న మాతా వాకర్స్ క్లబ్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగస్వాములైన పలువురు ఉద్యమకారులను తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో ఆదివారం వీఎస్‌టి పార్కులో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు వి.నాగభూషణం మాట్లాడుతూ ఏ ఆకాంక్ష కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామో వాటిని సాకారం చేసుకోవాలన్నారు. నియామకాల కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వై.మురళీధరుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ లింగప్రకాష్, క్లబ్‌సెక్రెటరీ అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి కోనేరు జైహింద్, ఉపాధ్యక్షులు డాక్టర్ నీలా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజుల ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

కాచిగూడ: ఈనెల 3,4 తేదీల్లో కాచిగూడ, లింగంపల్లి రాఘవేంద్ర స్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న న్యూ లైఫ్ ఆయుర్వేదిక్ ఆయిల్ థెరపీ సెంటర్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యంతో పాటు ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన కలిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు 8247553984, 7993856327.

ఈటలకు సన్మానం



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఉద్యమ నేత, బీజేపీ జాతీయ నాయకులు ఈటెల రాజేందర్‌ను ఆదివారం అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, టి.శ్రీనివాస్ రాజ్, పిట్ల నాగేష్, ఉదయశ్రీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మామిడి భీమ్‌రెడ్డి

నల్లకుంట : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. శిబిరంలో వందలాది మంది వృద్ధులకు వైద్య చికిత్సలు అందించి మందులు అందజేశారు. శిబిరంలో చికిత్సలు పొందిన వారికి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివేక్ ఆధ్వర్యంలో ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి, మీడియా కన్వీనర్ ఎం.ఐ జాక్‌రాజ్, దీపిక రియాజ్ దిన్, వివిధ శాఖలకు చెందిన వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కవి అందెశ్రీకి అభినందన


అందెశ్రీతో డాక్టర్ నీలీ శ్రీధర్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర 10వ అవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రముఖ కవి అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవి ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ ప్రముఖ కవి అందెశ్రీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ పాట రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించడంతో అందెశ్రీ కష్టానికి తగిన ఫలితం లభించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నన్ని రోజులూ రాష్ట్ర గీతంగా అందెశ్రీ పేరు ప్రఖ్యాతులు స్థిర స్థాయిగా నిలిచి ఉంటాయన్నారు. అందెశ్రీ లాంటి గొప్ప కవి రచయిత మన తెలంగాణ వారు కావడం మనకెంతో గర్వకారణమన్నారు.

ప్రపంచ శాంతికి కృషి చేయాలి

హిమాయత్‌నగర్: ప్రపంచ శాంతికి అన్ని మతాలు కృషి చేయాలని అహమ్మదీయ ముస్లిం సంస్థ మహిళా విభాగం నేతలు అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి బషీర్‌బాగ్‌లోని ఓ హోటల్‌లో 'నవ సమాజ నిర్మాణంలో మహిళల కీలక పాత్ర' అనే అంశంపై సర్వధర్మ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమ్తుల్ వసి షమయిలా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త మహిళలందరూ ఒకే చోట చేరి శాంతి కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. మరియం అజీమ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆవుల బాలలత, రెవరెండ్ శాంతి రాబర్ట్ నతానియల్, ఉపేందర్ కౌర్ పాల్గొన్నారు. మహిళలు చైతన్యవంతమై విద్యా, విజ్ఞానాన్ని సంపాదించుకున్నప్పుడే సమ సమాజ నిర్మాణంతో పాటు శాంతి సాధ్యమవుతుందన్నారు. నేడు ప్రపంచం చాలా క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటుందని, ఈ తరుణంలో ప్రపంచ శాంతి కోసం సంస్థ ఈ తరహా కార్యక్రమాలు దోహదపడుతాయని వక్తలు పేర్కొన్నారు.

రుద్రాజెమ్స్ ఎన్ డైమండ్ షోరూం ప్రారంభం

బంజారాహిల్స్: ప్రముఖ రుద్రాక్ష నిపుణులు పాండురంగారావు జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 36లో రుద్రాజెమ్స్ ఎన్ డైమండ్ షోరూం అందుబాటులోకి తీసుకువచ్చారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత ఆదివారం షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రుద్రాక్ష ఆధ్యాత్మిక భావన పెంచడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుస్తుందన్నారు. చాలా మంది జాతక రీత్యా కొన్ని ప్రత్యేకమైన రాళ్లు ధరిస్తుంటారని అయితే వీటి విషయంలో మోసాలు కూడా జరుగుతుంటాయన్నారు. యశ్వి డైమండ్స్ ఎండి రాం, జస్టిస్ ఈశ్వరయ్య, సినీ ప్రముఖులు హను రావిపూడి, జేకే భారవి, మిస్సెస్ ఇండియా రన్నరప్ ప్రీతిరెడ్డి పాల్గొన్నారు.

సాయం చేస్తానని నమ్మించి బ్యాగుతో పరారీ


బ్యాగును అప్పగిస్తున్న సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు

ఖైరతాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఫుడ్ స్టాల్ ఏర్పాటుచేసేందుకు కరీంనగర్‌కు చెందిన స్వరూప శనివారం సాయంత్రం తమ మిల్లెట్ ఉత్పత్తులతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడినుంచి ఆటోలో ట్యాంక్ బండ్‌కు వరకు వచ్చింది. అక్కడ రోడ్డు మూసివేయడంతో మరో మహిళతో కలిసి తమ ఉత్పత్తుల బ్యాగును తీసుకుని వెళ్తుండగా అదే సమయంలో సైకిల్‌పై వచ్చిన ఓ బాలుడు ఆంటీ మీ బ్యాగు నా సైకిల్‌పై పెట్టండి నేను మీ స్టాల్ వరకు తెస్తా అని చెప్పాడు. వారు వద్దని వారించినా వినకుండా ఇవాళ నేను ఇదే పని చేస్తున్నా ధైర్యంగా మీ బ్యాగు పెట్టండి అని చెప్పడంతో వారు ఆ బ్యాగును సైకిల్ వెనుక భాగంలో పెట్టి కట్టారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత వారిలో ఓ మహిళ నీళ్ల తాగేందుకు పక్కకు వెళ్లడంతో స్వరూపను కూడా సదరు కుర్రాడు మీరు కూడా నీళ్ల తాగండి అని చెప్పాడు. సైకిల్ స్టేజీ దాటి ముందుకు వెళ్లగానే వారి కళ్లు గప్పి బ్యాగ్‌తో ఉడాయించాడు. తాము మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు బ్యాగ్‌పై ఆశలు వదలుకున్నారు. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బందోబస్తులో ఉన్న సైఫాబాద్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సాయికిరణ్ ఎన్టీఆర్ ఘాట్ సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద బ్యాగు పడి ఉండటాన్ని గుర్తించి చెక్ చేయగా అందులో మిల్లెట్ ఉత్పత్తులతో పాటు స్వీట్లు, పచ్చళ్లు ఉన్నట్లు గుర్తించాడు. ఉత్పత్తులపై ఉన్న నెంబర్‌కు ఫోన్ చేయగా కరీనంగర్ అడ్రెస్‌లో ఉన్న వారు ఫోన్ లిఫ్ట్ చేశారు. తమకు బ్యాగు దొరికిందని, మీ వాళ్లు ఎవరైనా హైదరాబాద్‌కు వచ్చారా అని ఆరా తీయగా ట్యాంక్‌బండ్‌పై స్టాల్ పెట్టుకునేందుకు వచ్చిన స్వరూప నెంబర్ ఇవ్వడంతో ఆమెకు ఫోన్ చేశారు. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఆదివారం ఆమెకు బ్యాగును అప్పగించారు. బ్యాగులో కొన్ని స్వీట్లు, లడ్డూలు తీసుకొని మిగతా ఉత్పత్తులను వదిలేసి వెళ్లినట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సీసీ కెమెరాలో పరిశీలించగా సైకిల్‌పై బ్యాగుతో కుర్రాడు వెళ్తున్న దృశ్యాలను పోలీసులు గుర్తించారు.